కంకర పోశారు.. తారు మరిచారు!

- దుమ్ము, ధూళితో తిప్పలు
- పట్టించుకోని అధికారులు

కౌటాల: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలు పడి ఉండడంతో రోడ్డు వేయాలని గ్రామీణ ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకున్నారు. దీంతో గత ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావుడిగా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించింది. రోడ్డుపై కంకర వేసి ఏడాది అవుతున్నా నేటికీ తారు మాత్రం వేయలేదు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందనే చందంగా తమ పరిస్థితి మారిందని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. కంకర పోసి వదిలేయడంతో ఈ రోడ్డుపై ప్రయాణం నరకంగా మారిందని ప్రజలు వాపోతున్నారు.

ఓట్ల కోసం హడావుడిగా..

గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్ల నిధులు మంజూరయ్యాయని.. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు గత పాలకులు, సంబంధిత శాఖల అధికారులు హడావుడిగా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ సకాలంలో రోడ్డు పనులు పూర్తి చేయడంలో గుత్తేదారులు, అధికారులు నిర్లక్ష్యం వహించడంతో వాహనదారుల కష్టాలు రెట్టింపయ్యాయి. ఏడాదిగా రోడ్డు పనులను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎన్నికల్లో ఓట్ల కోసమే రోడ్డును తవ్వి కంకర పోశారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాగా కంకర రోడ్డుపై నుంచి వాహనాలు వెళ్లిన ప్రతీసారి దుమ్ము లేస్తోంది. వీటి ద్వారా స్థానికులకు శ్వాసకోశ, మూత్రపిండాల సంబంధిత వ్యాధులు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పంటలపై దుమ్ము..

కౌటాల –గుడ్లబోరి, కోయగూడ –గురుడపేట రోడ్లపై కంకర వేసి ఏడాది కావస్తున్నా రోడ్డుపై తారు వేయకపోవడంతో వాహనాలు వెళ్లిన ప్రతీసారి దుమ్ము, ధూళి లేస్తుంది. రోడ్డు పక్కనే ఉన్న పత్తి పంటపై దుమ్ము పడడంతో పంట నాణ్యత తగ్గుతోంది. దీనికి తోడు దుమ్ము, ధూళి కారణంగా పత్తితీత పనులకు కూలీలు ఎవరూ రాకపోవడంతో రోజుల తరబడి పత్తి చేలోనే ఉండి ఎండకు ఎండి రాలిపోతుందని రైతులు వాపోతున్నారు. పత్తిపై దుమ్ము పడడంతో వ్యాపారులు తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. కాగా రోడ్డుపై కంకర ఉండడంతో వాహనాలు చెడిపోతున్నాయి. అలాగే దుమ్ము లేవకుండా గుత్తేదారులు రోడ్డుపై నీళ్లు పట్టాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. దీంతో వాహనాలు వెళ్లిన ప్రతీసారి భారీగా దుమ్ము లేస్తోంది. దీంతో స్థానిక గృహాలు దుమ్ముతో నిండిపోతున్నాయి. దీనికి తోడు కంకరపై నుంచి ద్విచక్ర వాహనాలు నడిపేందుకు వాహనదారులు ముప్పుతిప్పలు పడుతున్నారు.ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


కంకర వేసి వదిలేసిన కోయగూడ -గురుడుపేట రోడ్డు

ఏడాదిగా నరకయాతన..

ఏడాది క్రితం రోడ్డుపై కంకర వేసిన గుత్తేదారులు వాహనదారులు, ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారు. కౌటాల మండలంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో తారురోడ్డు పనులను ప్రారంభించింది. ఆర్‌అండ్‌బీతో పాటు పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిధులు వెచ్చించి రోడ్డు పనులు ప్రారంభించినా నిర్మాణ దశలోనే నిలిచాయి. కౌటాల –టీకంగూడ వరకు దాదాపు 8 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప భూమిపూజ చేశారు. రోడ్డు నిర్మాణానికి రూ.3.5 కోట్ల నిధులను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే గతేడాది ఆగస్టులో మండలంలోని కోయగూడ –గురుడుపేట వరకు 2 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులతో అప్పటి పాలకులు భూమిపూజ చేశారు. దీంతో సంబంధిత గుత్తేదారులు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి రోడ్డుపై కంకర వేశారు. కానీ ఏడాదిగా ఈ రోడ్డుపై తారు వేయడం మర్చిపోయారు. దీంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.


కౌటాల -గుడ్లబోరి రోడ్డుపై లేస్తున్న దుమ్ము

కంకరతో కష్టాలు

కౌటాల –గుడ్లబోరి రోడ్డు సమీపంలో మా ఇల్లు ఉంది. రోడ్డుపై కంకర వేసి ఏడాదైనా తారు వేయలేదు. కంకర రోడ్డుపై నీళ్లు సైతం పట్టడం లేదు. దీంతో వాహనాలు వెళ్లిన ప్రతీసారి విపరీతంగా దుమ్ము లేస్తుంది. దీంతో మా ఇంటిలోని గదులు దుమ్ముతో నిండిపోతున్నాయి. దీంతో ప్రతీరోజు మా ఇంటి ముందు కంకర రోడ్డుపై మేమే నీళ్లు పడుతున్నాం. కంకరపై నుంచి వాహనాలు వెళ్లిన ప్రతీసారి మా ఇంటిలోకి కంకర రాళ్లు వచ్చి పడుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడుతున్నారు. అధికారులు వెంటనే రోడ్డు పనులను పూర్తి చేయించాలి.

– సంతోష్, కోయగూడ, కౌటాల

అకాల వర్షం.. తడిసిన పంట


కౌటాల: బోదంపల్లిలో తడిసిన పత్తి పంట

దహెగాం/రెబ్బెన/కౌటాల: అకాల వర్షం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. వారం రోజు లుగా ఆకాశం మబ్బులు పట్టి ఉండటంతో కల్లాల్లోని ధాన్యం ఆరడం లేదు. అలాగే శని వారం, ఆదివారం పలుచోట్ల కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. టార్పాలిన్లు కప్పేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు. చేలలోని పత్తి పంట సైతం తడిసిందని వాపోతున్నారు. కూలీల కొరతతో వేలాది ఎకరాల్లో పత్తి చేలల్లోనే ఉంది. అకాల వర్షానికి తడిసి మొక్కలపైనే మొలకలు వస్తున్నాయి. కోతలు పూ ర్తికాకపోవడంతో వరి నేలవాలుతోంది. ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. వర్షం కారణంగా కౌటాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాపై అధికారులను సంప్రదించినా పట్టించుకోలేదని వినియోగదారులు వాపోయారు.


దహెగాంలో తడిసిన ధాన్యం బస్తాలు

క్లుప్తంగా

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేసిన కార్యవర్గం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘం బలపేతం చేసేందుకు క్షేత్ర స్థాయి నుంచి సంఘాలు ఏర్పాటు కావాలన్నారు. ఐక్యంగా ముందుకు వెళ్లాలని, ఇందుకు కార్యవర్గ సభ్యులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కనకయ్య, శంకర్, మల్లయ్య, శ్రీకాంత్, భద్రయ్య పాల్గొన్నారు.

'పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి'


గుండ శ్యామ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గుండ శ్యామ్‌ను ఆదివారం జిల్లా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శాలువతో సన్మానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీలకు రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుండ శంకర్, మల్లయ్య, అనుమాండ్ల శ్రీకాంత్, అల్లె శ్రీకాంత్, కోమటిపెల్లి లింగయ్య, భద్రయ్య పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై మధుకర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం బాధితుడికి పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌటాలలోని ప్రగతి కాలనీకి చెందిన హరీశ్ ఇటీవల తన రూ. 15 వేల విలువ గల సెల్‌ఫోన్‌ను పొగొట్టుకున్నారని తెలిపారు. సీఈఆర్ ద్వారా ఫిర్యాదు చేయగా ఫోన్ ట్రేస్ చేసి బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు. మొబైల్ పోయిన వెంటనే ఫోన్‌లో ఉన్న సిమ్ నంబర్‌తో కొత్త సిమ్ తీసుకొని ఆ మొబైల్ ఐఎంఈఐ నంబర్ తీసుకొని మీసేవలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

బెజ్జూర్: కేసుల పరిష్కారంలో రాజీ మార్గమే రాజమార్గమని ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈనెల 14న సిర్పూర్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ఉందని పేర్కొన్నారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో, సివిల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూ తగాదాలు, వివాహ, కుటుంబ కేసులు, వాహన ప్రమాదాలు, చిట్‌ఫండ్, చెక్ బౌన్స్ ఇతర కేసులపై సిర్పూరు కోర్టులో సంప్రదించాలన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం గ్రామ శివారులో గల ఎల్లమ్మ గుడి వద్ద ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. దాడిలో కోసిని గ్రామానికి చెందిన కొట్రంగి శంకర్, ఈజ్‌గాం గ్రామానికి చెందిన గడ్డం సాయికుమార్, ప్రశాంత్, గన్నారం గ్రామానికి చెందిన కన్నెపల్లి నందు, చింతగూడ గ్రామానికి చెందిన సాగర్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ జీగాం గ్రామానికి చెందిన నోముల మల్లేశ్,ఎల్లాగౌడ్, చింతగూడకు చెందిన సాయి, వేంపల్లికి చెందిన వెంకటేశ్‌లు పరారీలో ఉ న్నట్లు పేర్కొన్నారు. దాడిలో రూ.12,700 స్వాధీనం చేసుకుని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

నేడు చీరలు పంపిణీ

కెరమెరి: మండలంలోని స్వయం సహాయక సంఘంలో ఉన్న మహిళలకు సోమవారం ఉదయం 9.30 గంటలకు చీరల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు ఏపీఎం జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 34 వీవోల్లో 530 ఎస్‌హెచ్‌జీలు ఉండగా, వీటిలో 5800 మంది మహిళలు ఉన్నారు. సీసీ, ఎంఎస్‌సీసీ, వీవోఏలు సకాలంలో హాజరై చీరలు తీసుకెళ్లాలని ఆయన కోరారు.

అమరగొండలో పోలీసుల సోదాలు

దహెగాం: మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో మారుమూల గ్రామాల్లో పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చారా అని ఆరా తీస్తున్నారు. ఆదివారం ఉదయం మండలంలోని అమరగొండ గ్రామంలో ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. మావోయిస్టులకు ఎవరూ సహకరించొద్దని సూచించారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బులు పోగొట్టుకున్న వారు వెంటనే 1930 నంబరుకు డయల్ చేయాలన్నారు. గ్రామస్తులు ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు.


అమరగొండ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

వేతనాలు పెంచుతూ జీవో అమలు చేయాలి

రెబ్బెన: అసెంబ్లీ సమావేశాల్లో మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచుతూ జీవో అమలు చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణమాచారి డిమాండ్ చేశారు. ఆదివారం మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆటోజాత నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కోడిగుడ్ల బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని వేతనాల్లో సైతం కేంద్రం వాటా ఒకసారి, రాష్ట్రం వాటా మరోసారి విడుదల చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వాలు కార్మికులను గుర్తించి మెనూ చార్జీలు ఒక్కో విద్యార్థికి కనీసం రూ.20 ఇవ్వాలని, కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాయ, మండల అధ్యక్షురాలు విజయ, కార్మికులు క్రిష్ణవేణి, సుజాత, పద్మ, రాజుబాబు, గౌరుబాయి, రతుబాయి, రూప్లిబాయి పాల్గొన్నారు.


రెబ్బెనలో ఆటోజాత నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

బెజ్జూర్: బీజేపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు మండలంలోని లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను దళారుల ప్రమేయం లేకుండా వారి ఇంటికి వెళ్లి నేరుగా అందజేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ఆదేశాల మేరకు అందిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మండల మాజీ అధ్యక్షుడు మనోహర్ గౌడ్, కొప్పుల శంకర్, జాడి దిగంబర్, వసీఉల్లా ఖాన్, రాజారాం, నారాయణ, బాపు, మల్లేశ్, రాకేశ్, బాపు, రమేశ్, శ్రీనివాస్, తిరుపతి గౌడ్, దిలీప్, బిక్షపతి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న పాల్వాయి సుధాకర్‌రావు

బౌద్ధ మార్గంలో నడవాలి

వాంకిడి: బుద్ధ భగవానుడు చూపిన బౌద్ధమార్గంతోనే మానవ జీవనం సార్థకమవుతుందని నాగ్‌పూర్ దీక్షభూమి భంతే సోమ్‌నాథ్ మహాథేరో సూచించారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహారలో 1960 డిసెంబర్ 8వ తేదీన మొదటిసారి ధమ్మ దీక్ష ఇచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన ప్రవచన కార్యక్రమంలో భంతే పాల్గొని మాట్లాడారు. రాజూర పట్టణ నాయకులు రాజు జీవన్, నాగోరావు పెద్వాకర్, విలకబాయి ఉప్రె, జిల్లా బౌద్ధ మహాసభ అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, మండల అధ్యక్షుడు జైరాం ఉప్రే, నాయకులు విజయ్, తిరుపతి, వినేష్, శ్యాంరావు, దుర్గం సునీల్, విలాస్, రాజేంద్రప్రసాద్, హంసరాజ్, జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భంతే సోమ్‌నాథ్ మహాథేరో

భక్తిశ్రద్ధలతో కాలభైరవ పారాయణం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో ఆదివారం కాలభైరవ అష్టమి పురస్కరించుకుని ఆర్యవైశ్య మహిళలు సామూహిక కాలభైరవ అష్టక పారాయణం చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ముదిగొండ రాజశేఖర శర్మ, చంద్రశేఖర శర్మ, ప్రసాద శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేపట్టారు.


ఆలయంలో పారాయణం చేస్తున్న మహిళలు

ప్రారంభమైన శివమల్లన్న బోనాలు


పూజలు చేస్తున్న భక్తులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో షష్టి బోనాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో శివమల్లన్నకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మంచినీరు, క్యూలైన్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. ఈజ్‌గాం ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంత్ శిరోమణి శ్రీ సంతాజీ విగ్రహావిష్కరణ


జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సంత్ శిరోమణి శ్రీ సంతాజీ విగ్రహం


వాంకిడి: విగ్రహావిష్కరణలో పాల్గొన్న గాండ్ల తెలికుల సంఘం నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా వద్ద సంత్ శిరోమణి శ్రీ సంతాజీ జగన్నాడే మహరాజ్ విగ్రహాన్ని సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. జగన్నాడే మహరాజ్ 400వ జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి మీదుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్‌నర్ రమేశ్, అఖిల గాండ్ల తేలికుల జిల్లా అధ్యక్షుడు హివరే సందీప్, మారుతి పటేల్, సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలో ఆదివారం అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంత్ శిరోమణి శ్రీ సంతాజీ జగన్నాడే మహరాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహరాజ్ 400వ జయంతి పురస్కరించుకుని విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించినట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. జగద్గురువుగా, శ్రీ భక్త తుకారాం గారి అభంగాల రచయితగా ప్రఖ్యాతి గాంచిన శ్రీ సంతాజీ జగన్నాడే మహరాజ్ గాండ్ల తేలికుల ఆరాధ్యదైవమన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభా కార్యక్రమానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో గాండ్ల తేలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు హివ్రె సందీప్, మండల అధ్యక్షుడు బండె బాలేష్, పటేల్ బండె నాందేవ్, మాజీ సర్పంచ్ బండె తుకారాం తదితరులు పాల్గొన్నారు.

పొగమంచు సోయగం


కెరమెరిలో లైట్లు వేసి వస్తున్న వాహనాలు


జిల్లాకేంద్రంలో..

జిల్లా కేంద్రంతో పాటు కెరమెరి మండల కేంద్రం, మండలంలోని పిట్టగూడ, టోకెన్‌మోవాడ్, పాటగూడ, బాబేఝరి, లైన్‌పటార్ గ్రామాలను ఆదివారం ఉదయం పొగమంచు కమ్మేసింది. శనివారం రాత్రి వర్షం కురవగా, తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల పొగమంచు ప్రభావం కనిపించింది. ఉదయం 8 గంటల వరకు వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాయి.

– ఆసిఫాబాద్/కెరమెరి


కెరమెరిలో పంట పొలాలపై కమ్ముకున్న పొగమంచు


కెరమెరిలో ఇళ్లను కప్పేసిన పొగమంచు

తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనాలి

తిర్యాణి: అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గంభీరావుపేట గ్రామంలోని గోదాం వద్ద రైతులు ఆరబెట్టిన ధాన్యం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మించిన గోదాం వద్ద ర్యాంపు సౌకర్యం లేకపోవడంతో ధాన్యం లోపలికి తీసుకెళ్లలేకపోయారని వెంటనే ర్యాంపును నిర్మించాలన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి షరతులు విధించకుండా గరిష్ట ధరకు కొని రైతులను ఆదుకోవాలన్నారు.


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్